క్లుప్తంగా

భూసేకరణ గ్రామసభలు



నవాబుపేటలో మాట్లాడుతున్న కిరణ్‌ప్రకాశ్

చిగురుమామిడి: మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ప్రకటించకుండా గ్రామసభలు ఎందుకు నిర్వహిస్తున్నారని గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ తవ్వకాల్లో భూములు కోల్పోతున్న నవాబుపేట గ్రామ రైతులు అధికారులను నిలదీశారు. భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ భూనిర్వాసితులతో గురువారం గ్రామసభ నిర్వహించారు. నిర్వాసితులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఎకరాకు రూ.40 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ ఏఈ, ఆర్ఐ నిఖిలారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. సుందరగిరి రైతు వేదికలో కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించగా భూనిర్వాసితులు ఆర్డీఓ ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. సాధ్యమైనంత వరకు న్యాయం జరిగేలాచూస్తామన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చొప్పదండి: పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో ఫిబ్రవరి 3న వసంత పంచమిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈమేరకు గురువారం ట్రస్మా ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కరపత్రాన్ని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ విడుదల చేశారు. ప్రత్యేక పూజలు, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుర్రం ఆనందరెడ్డి, తిప్పర్తి శ్రీనివాస్, నిజానపురం చందు, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, గంధం నరేశ్, కునమల్ల దేవానంద్, నాగోతు వినోద్ కుమార్, తమ్మడి కనకరాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



ప్రహరీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ పరిధి పల్లెప్రకృతి వనం స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీతో పాటు షెడ్డును గురువారం అధికారులు తొలగించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఎంపీవో శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు.

నియామకం



గణపతి

ఇల్లందకుంట: మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి ఆదేశాల మేరకు మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన గుండ్ల గణపతిని ఎంఎస్పీ ఇల్లందకుంట అధ్యక్షుడిగా నియమించారు. ఈమేరకు గురువారం నియామకపత్రం అందజేశామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచంద్రం తెలిపారు. అనంతరం గణపతి మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వసంత్, ఆదిత్య పాల్గొన్నారు.

వెదిరలో కంటి వైద్యశిబిరం



శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు

రామడుగు: మండలంలోని వెదిరలో గురువారం రేకుర్తి కంటి వైద్యశాల, మంకమ్మతోట, రాజేశ్వరీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 30 మందిని ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బూర్ల విద్యాసాగర్, అంబటి రవీందర్, పాత విశ్వనాథం, గండోజు లక్ష్మయ్య, రాళ్లబండి శంకర్ ప్రసాద్‌రెడ్డి, నాగుల రాజశేఖర్‌గౌడ్, తుమ్మనపల్లి ఆంజనేయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

రామడుగు: మండలంలోని వెలిచాల క్రాస్‌రోడ్డు నుంచి కొత్తపల్లి వెళ్లే బైపాస్‌రోడ్డులో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. దీంతో వెలిచాల, వెదిర, దేశరాజ్‌పల్లి, కొత్తపల్లి, మల్యాపూర్, చింతకుంట గ్రామాల ప్రజలు వెంకటేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ..

- మానేరువాగు నుంచి అక్రమ రవాణా
- ఇసుక తవ్వకాల్లోనూ ట్రాక్టర్ డ్రైవర్లు మైనర్లే
- సాండ్ ట్యాక్సీకి ఎగనామం..
- అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆరా..?



ట్రాక్టర్‌లో కోర్కల్ నుంచి అక్రమంగా ఇసుక తరలింపు

వీణవంక: మండలంలోని ఆయా గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ రవాణాతో మానేరు ఉనికిని కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. పోలీసుల రక్షణలేదు.. రెవెన్యూ, మైనింగ్ అధికారుల భయంలేదు. ఇసుక దోపిడీతో వాగు ఉనికి కోల్పోనుందనే ప్రమాద హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఇవేవీ పట్టని ఇసుక మాఫియా కట్నాలు చదివిస్తూ కార్యాన్ని కానిచ్చేస్తోంది. వందల కొద్ది ట్రిప్పుల ఇసుకను జిల్లా సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటోంది. మండలంలోని చల్లూరు, పోతిరెడ్డిపల్లి, కోర్కల్, మల్లారెడ్డిపల్లి గ్రామాల శివారులో మానేరు వాగు ఉంది. చల్లూరు, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో సాండ్ ట్యాక్సీ ఉంది. కోర్కల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల నుంచి ట్యాక్సీ చెల్లించకుండానే ఇసుక తరలిస్తున్నారు. మానేరు వాగు ఇసుకకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు కన్నేశారు. పోతిరెడ్డిపల్లిలో–40, కోర్కల్–20 ఇసుక ట్రాక్టర్లు నిరంతరం ఇసుక రవాణా కొనసాగిస్తున్నాయి. ట్రిప్పునకు స్థానికంగా రూ.2,300 పలుకుతుండగా, ఇతర ప్రాంతాలకు రూ.నాలుగు వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక్కో ట్రాక్టర్ రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున తరలిస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తుందనే ఆరోపణలున్నాయి.

పోలీసుల సమాచారం ఎప్పటికప్పుడు

అక్రమదారిన వెళ్లడం ఎందుకనో లేక పోలీసులు ఏం చేయలేరనే భరోసాతోనో రాత్రి, పగలు ఇసుక తరలించేస్తున్నారు. కోర్కల్ ట్రాక్టర్లు రెడ్డిపల్లి, ఘన్ముక్కుల క్రాస్, మల్లన్నపల్లి, శంకరపట్నం మండలం ఆముదాలపల్లి మీదుగా, పోతిరెడ్డిపల్లి ట్రాక్టర్లు కోరపల్లి, మీదుగా జమ్మికుంట, హుజూరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. ట్రాక్టర్ వాగు నుంచి బయలుదేరే ముందు బైక్‌పై రెండు కిలోమీటర్ల దూరంలో ఇద్దరు, ట్రాక్టర్ వెనక నుంచి మరో వ్యక్తి ఉంటారు. పోలీసుల సమాచారం ఎప్పటికప్పుడు ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌కు చేరవేస్తుంటారు. ఎస్సై తోట తిరుపతి ఇసుక రవాణాపై కేసులు నమోదు చేస్తున్న రవాణా మాత్రం ఆగడం లేదు. పోలీసులతోపాటు రెవెన్యూ, మైనింగ్ అధికారులు గస్తీ పెడితేనే అక్రమ రవాణా అరికట్టవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉన్నతాధికారుల ఆరా..?

ఇసుక తరలింపుపై కొందరు రైతులుఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కోర్కల్ గ్రామం నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటంపై అధికారులు కోపంగా ఉన్నట్లు సమాచారం. సాండ్ ట్యాక్సీకి గండి కొట్టి అక్రమ మార్గంలో రవాణా చేస్తుంటే అధికారులు ఎందుకు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ రవాణాను అరికట్టి, ఇసుక మాఫియా, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మైనర్లతో పనులు

ఇసుక తవ్వకాలు, తరలింపులో మైనర్లే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. గతంలో చాలా మంది ట్రాక్టర్ డ్రైవర్లు మైనర్లేనని పోలీసులు గుర్తించారు. కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రవాణాకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతోపాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అంతేగాక మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతున్నారని గతంలో పలువురు రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బాలకార్మికుల నిర్మూలన వ్యవస్థ సరిగా అమలు కావడంలేదనే విమర్శలు వెలువడుతున్నాయి. అధికారుల ముందు నుంచే మైనర్లు ట్రాక్టర్లు నడుపుతూ వెళ్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు 80 కేసులు నమోదు చేశాం. ఇసుక అక్రమ రవాణా చేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించం.

– తోట తిరుపతి, ఎస్సై, వీణవంక

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు సుప్రభాత సేవ, ఆరాధన తదితర పూజలు మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. పద్మశాలీ కులస్తులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఫిబ్రవరి 1న నిర్వహించే కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ చైర్మన్ సత్యనారాయణ కోరారు. ఆలయ అర్చకులు ఘన్ముక్కుల సంతోషాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

హుజూరాబాద్/ఇల్లందకుంట: దళిత బంధు నిధులు విడుదలపై హుజూరాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా, ఇల్లందకుంటలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వీణవంక: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చొరవతోనే దళితబంధు నిధులు విడుదలయ్యాయని బీఆర్ఎస్, దళితుల నాయకుల ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, నాయకులు

తిమ్మాపూర్: దావోస్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకున్న ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం కరీంనగర్ వెళ్తుండగా అల్గునూర్ చౌరస్తాలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి ఘనస్వాగతం పలికారు. మంత్రికి శాలువా కప్పి పూలమొక్క అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గోపు మల్లారెడ్డి, తమ్మనవేణి రమేశ్ యాదవ్, కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, దుర్గాప్రసాద్, లక్ష్మారెడ్డి, నేరెళ్ల రవీందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్క్‌షాప్

హుజూరాబాద్: కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్ కొనసాగుతోంది. గురువారం మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్స్ ఆటో క్యాడ్ ఆన్సిస్‌ప్రో ఇంజినీరింగ్ మొదలగు సాఫ్ట్‌వేర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో సమస్యలను పరిష్కరించడానికి విరివిగా ఉపయోగిస్తున్నారని అన్నారు. కళాశాల డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ.. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులకు అన్ని సదుపాయాలున్నాయన్నారు.

రోడ్డుపై బైఠాయించి జర్నలిస్టుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ నుంచి హుజూరాబాద్ జర్నలిస్టులతో పాటు వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకులు ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సిగ్గుచేటని, గత ప్రభుత్వం కేటాయించిన స్థలంలో జర్నలిస్టులు రూ.లక్షలు వెచ్చించి గృహ నిర్మాణాలు చేసుకున్నారని, వాటిని జర్నలిస్టులకే కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జమ్మికుంట రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ప్రెస్ క్లబ్ కన్వీనర్ ధర్మారెడ్డి, కో–కన్వీనర్ రాములు, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడు మక్సూద్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాధిక, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

జమ్మికుంట: మండలంలోని నాగంపేట జీపీ నిధులు దుర్వినియోగంపై కరీంనగర్‌కు చెందిన కటుకోజ్వల శ్రీనివాసాచారి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఎల్‌పీవో పాత శ్రీనివాస్ గురువారం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి, వివరాలను సేకరించారు. శ్రీనివాసాచారి తన వద్ద ఉన్న ఆధారాలతో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేయగా హాజరు కాలేదని, గతంలో పనిచేసిన కార్యదర్శి ఇల్లందుల శ్రీనివాస్, ప్రస్తుతం విధుల్లో ఉన్న దాసరి అంకుష్ హాజరై రికార్డులు, వివరాలు అందించారని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ స్వాతికృష్ణారెడ్డి ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో సుధారాజేంద్ర

లెప్రసీపై అవగాహన

మానకొండూర్: లెప్రసీ(కుష్టు)పై భయపడాల్సిన అవసరం లేదని అడిషనల్ డీఎంహెచ్‌వో సుధా రాజేంద్ర అన్నారు. మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో స్పర్శ్.. లెప్రసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. శరీరంపై మచ్చలు, స్పర్శ లేకుంటే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రార్థన సమయంలో లెప్రసీ గూర్చి విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. డాక్టర్లు నికత్, సల్మాన్, సీహెచ్‌వో రాజ్‌నాయక్, ప్రకాశ్‌రావు, కృపాలాదేవి, పావని, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

బాపూజీకి నివాళి



హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న మాజీ చైర్ పర్సన్ రాధిక, తదితరులు



జమ్మికుంటలో..

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అందరూ బాపూజీ బాటలో ప్రయాణించాలన్నారు. కన్యాకపరమేశ్వరి దేవాలయ సమీపంలోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధిక, తదితరులు నివాళి అర్పించారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

చొప్పదండి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

శంకరపట్నం: కేశవపట్నంలో గాంధీ చిత్రపటానికి మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

రామడుగు: రామడుగు, వెదిర గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జవ్వాజీ హరీశ్ ఆధ్వర్యంలో నాయకులు గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

విజయవంతం చేయాలి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శంకరపట్నం: ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు, వెయ్యి గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ కోరారు. కేశవపట్నంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా లింగాపూర్ కు చెందిన కోడూరి మహేశ్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సయ్య, సమ్మయ్య, కోంద్ర రాజయ్య, బొజ్జ రవి, సుధాకర్,సంపత్, తిరుపతి,నాగరాజు, కుమార్,రాజు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి నాయకుల వినతి



తిమ్మాపూర్: వినతిపత్రం అందిస్తున్న రమేశ్, దేవేందర్‌రెడ్డి, నాయకులు

తిమ్మాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టారు. మండలంలోని మహాత్మానగర్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. హామీలు అమలులో ప్రభుత్వం విఫలమైందని, హామీలు నెరవేర్చే దిశగా జ్ఞానోదయం కలిగించాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు మహాత్మాగాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందించారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసేలా ప్రభుత్వానికి బుద్ధిప్రసాదించాలని కోరారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, పథకాల పేరిట కాలయాపన చేస్తుందని, ప్రభుత్వానికి దారి, సీఎం రేవంత్‌రెడ్డికి మంచి జ్ఞానం ఇవ్వాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ముంజంపల్లిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

చొప్పదండి: పట్టణంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

సైదాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు సైదాపూర్‌లో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

సీసీఆర్‌టీలో తెలంగాణ టీచర్లు



బోనాల ప్రదర్శనలో టీచర్లు

శంకరపట్నం: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్కాకుల కోటేశ్వర్‌రావు అస్సాంలోని గౌహతిలో సీసీఆర్‌టీ(సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ అండ్ ట్రైనింగ్) కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, వంటకాలపై ప్రదర్శన ఇచ్చారు. ఈ నెల 21నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ప్రదర్శనలో 13 రాష్ట్రాలు వారు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి కోటేశ్వర్‌రావుతో పాటు మరో పదిమంది టీచర్లు పాల్గొన్నారు.

హుజూరాబాద్ కమిషనర్ బదిలీ!

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య బదిలీపై సిరిసిల్లకు వెళ్లనున్నారని, ఆయన స్థానంలో కె. సమ్మయ్య బదిలీపై వస్తున్నట్లు సమాచారం.

- **అగ్ని ప్రమాదం**

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి పాత గ్రామ పంచాయతీ కార్యాలయం బయట కట్టెలు, ట్రైసైకిల్ బుధవారం రాత్రి దగ్ధం కాగా మంటలు కార్యాలయంలోకి వ్యాపించడంతో అల్మారలోని పాతరికార్డులు కాలి బుడిదయ్యాయి. అగ్ని ప్రమాదం గుర్తు తెలియని వ్యక్తుల వల్లే జరిగిందని కార్యదర్శి అంజిరెడ్డి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

- **వీడనున్న హత్య మిస్టరీ**

గంగాధర: కొండన్నపల్లి బస్టాండు సమీపంలో రోడ్డు పక్కన లభ్యమైన మమత హత్య మిస్టరీని పోలీసులు ఛేదిస్తున్నారు. హత్యకు వినియోగించిన కారును బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నిందితుడిని పట్టుకోవడానికి బాలుడి ఆచూకీ కోసం పోలీసులు హైదరాబాద్ వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

- **సబ్‌సెంటర్‌లో పాము కలకలం**

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో నాగుపాము సుమారు రెండు గంటల పాటు హల్‌చల్ చేసింది. ఓ టేబుల్‌పై బుసలు కొడుతుండటంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. నాగుపాము ప్రత్యక్షం కావడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సిబ్బంది గమనించకపోతే పెను ప్రమాదం జరిగేది.

- **క్వారీ పనుల అడ్డగింత**

గంగాధర: మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధి మద్రిగడ్డ గ్రామస్తులు ఊరి సమీపంలోని గ్రానైట్ పనులను గురువారం అడ్డుకున్నారు. క్వారీ సమీపంలో పెద్దమ్మ గుడి ఉందని, క్వారీలో జరిగే బ్లాస్టింగ్‌లతో దేవాలయం ధ్వంసమవుతుందని ముదిరాజ్ కులస్తులు పలుమార్లు క్వారీ నిర్వాహకులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని, గుడి సమస్య పరిష్కారమయ్యే వరకు పనులు ఆపేయాలన్నారు.

- **తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు**

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు పెరుమాండ్ల శ్రీనివాస్(40)గురువారం తాటి చెట్టు పైనుంచి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారీ కిందపడ్డాడు. తోటి కార్మికులు వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వం శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల రాజగౌడ్ కోరారు.

జమ్మికుంట: వావిలాలకు చెందిన గీత కార్మికుడు వీరగోని రాములు తాటిచెట్టు ఎక్కే క్రమంలో మోకుజారీ కిందపడగంతో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

- **అదృశ్యం కేసు..**

జమ్మికుంట: యువతి అదృశ్యం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. పట్టణానికి చెందిన ఓ యువతి హనుమకొండలో డిగ్రీ చదువుతోంది. సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చి గురువారం ఉదయం కిరాణ షాపుకు వెళ్లొస్తానని ఇంటికి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

- **అట్రాసిటీ..**

జమ్మికుంట: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. నగురం గ్రామానికి చెందిన కవ్వంపల్లి ఎల్లయ్య భూమి పక్కన వావిలాల గ్రామానికి చెందిన ఉరా సంపత్‌రావు వ్యవసాయ భూమి ఉంది. గెట్టుపై వివాదం ఏర్పడగా ఎల్లయ్యను సంపత్‌రావు కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

- **సెల్‌ఫోన్ అప్పగింత**

చొప్పదండి: పోగొట్టుకున్న సెల్ ఫోనును రెండేళ్ల అనంతరం పోలీసులు రికవరీ చేశారు. పట్టణానికి చెందిన ఎలగుర్తి రాకేశ్ 2022లో ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. 2024లో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మొబైల్‌ను గుర్తించి గురువారం రాకేశ్ అప్పగించినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు.